క్లుప్తంగా

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్ రావు తెలిపారు. హనుమకొండలోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని, సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

సర్పంచ్ దౌర్జన్యం.. పోలీసులకు ఫిర్యాదు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో సర్పంచ్ అర్షం బలరామ్‌తోపాటు మరికొందరు తమపై దౌర్జన్యం చేసి తమకు చెందిన స్థలంలో సీసీ రోడ్డు వేశారంటూ అదే గ్రామానికి చెందిన సిరిమిల్ల జగ్గయ్య పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా జగ్గయ్య మాట్లాడారు. తన స్థలంలో సీసీ రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. తన అనుమతి లేకుండా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీధర్‌చారి



కమలాపూర్ : మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కన్నూరి శ్రీధర్‌చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆ అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొజ్జం ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా చందనాల నాగరాజు, సహాయ కార్యదర్శిగా కూచన నాగరాజు, కోశాధికారిగా మొగిలిచెర్ల అనిల్, గౌరవ అధ్యక్షుడిగా ఆడెపు శ్రీకాంత్ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు గొల్లపెల్లి రాజేంద్రప్రసాద్, అరుణ్‌కుమార్, సముద్రాల రాజేష్, బింగి సాయివర్మ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం



శాయంపేట : మండల కేంద్రంలో సర్పంచ్ కందగట్ల రవి ఆధ్వర్యంలో శుక్రవారం తైబజార్ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీఓ రంజిత్‌కుమార్ హాజరు కాగా గ్రామ పంచాయతీ పరిధిలోని తైబజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడు గదులకు కార్యదర్శి మడికొండ రత్నాకర్ వేలం నిర్వహించారు. వేలంలో తైబజార్‌ను రూ.1.25 లక్షలకు కోడెపాక సంజీవరావు, షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడు గదులను మారెపల్లి వినయ్, వినుకొండ శంకరాచారీ, వేణు, గాదె రాజేందర్, కొత్తపల్లి రవి, మంత్రి రవి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, వార్డు సభ్యులు ఇంద్రసేనారెడ్డి, కోల కిషన్, కోఆప్షన్ సభ్యులు సాధిక్, జీపీ ఉద్యోగులు మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



శాయంపేట : విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని రాజపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు చల్ల అయిలయ్య కథనం ప్రకారం.. మండలంలోని కాట్రపల్లి, రాజుపల్లి శివారు ప్రాంతంలోని 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు ఆవు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి తనకు పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు.

ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల కుమారస్వామి కుటుంబానికి అతడి సోదరుడు రఘుపతి చిన్ననాటి స్నేహితులు శుక్రవారం రూ.6 వేలు సాయం అందించారు. కుమారస్వామి ఇటీవల మృతి చెందాడు. ఈ క్రమంలో అతడి సోదరుడు రఘుపతితో కలిసి చదువుకున్న స్నేహితులు సాయం అందజేశారు. తొలుత కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘుపతి స్నేహితులు మలసాని లక్ష్మణరావు, రాజు, చింతనిప్పుల రమేష్, రాజేందర్, సిద్ధూ, విజన్‌రావు, కొండ మధుకర్, ఎంపీటీసీ అజ్మీర ఉమ రఘుసింగ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో సమర్థతకే పట్టం

● జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



శాయంపేట : అధికారులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



ఎల్కతుర్తి : అవార్డు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్



ఆత్మకూరు : సర్పంచ్‌లతో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

శాయంపేట : బీఆర్‌ఎస్ పాలనలో సమర్థతకే పట్టం కడతారని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ వికాస్ పురస్కార ప్రధానోత్సవానికి చైర్‌పర్సన్ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై సర్పంచ్‌లను, కార్యదర్శులను శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి చొరవ తీసుకున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అభినందనీయులని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో 9 అంశాలపై ఆన్‌లైన్ ద్వారా ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి మండల స్థాయిలో జాతీయ పంచాయతీ పురస్కారాలు అందజేస్తున్నట్లు చెప్పారు. శాయంపేట నుంచి మందారిపేట వరకు నిర్మించిన డబుల్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ కోసం జెడ్పీ నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

ఎల్కతుర్తి : అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సర్పంచ్‌లను, కార్యదర్శులను శాలువాలతో సన్మానించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవి, ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, ఎంపీడీఓ భాస్కర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూర్గుల రామారావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, స్థానిక సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లి సర్పంచ్ కంచ రవికుమార్, గూడెప్పాడ్ సర్పంచ్ బీరం శ్రీలత, పెంచికలపేట సర్పంచ్ కోరె లలిత, హౌజ్‌బుజుర్గు సర్పంచ్ రబియా బీ హుస్సేన్, నాగయ్యపల్లి సర్పంచ్ మాదాసి రజిత, అక్కంపేట సర్పంచ్ విజయ, కామారం సర్పంచ్ స్వరూప, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డిలకు పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అవార్డులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నడికూడ : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని కంఠాత్మకూర్ వాగుపై రూ.7 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో కంఠాత్మకూర్ గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చుతున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో స్థానికులు సహకరించాలని కోరారు. గతేడాది వడగండ్ల వానకు పంటలు దెబ్బతిన్న రైతులకు వారం రోజుల్లో పరిహారం అందుతుందని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, ఎంపీపీ మచ్చ అనసూర్య, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

పరకాల : పట్టణంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పర్యటించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రహరీని, అనంతరం వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వంగర గ్రామస్తుల సంక్షేమానికి పెద్దపీట

● మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు తనయుడు ప్రభాకర్‌రావు
● వైభవంగా మహాచండీ హోమం



హోమం నిర్వహిస్తున్న ప్రభాకర్‌రావు దంపతులు

ఎల్కతుర్తి : వంగర గ్రామస్తుల సంక్షేమానికి మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు కుటుంబం పెద్దపీట వేసిందని, వేస్తుందని ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో శుక్రవారం మహాచండీ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభాకర్‌రావు మాట్లాడారు. తన తల్లిదండ్రులు పీవీ.నర్సింహారావుల-సత్యమ్మలే కాకుండా తాతలు, ముత్తాతలు పీవీ.రంగారావు, రత్నమ్మ, రాజారామేశ్వర్‌రావు, శంకరమ్మ అనేక క్రతువులు, తత్వ ప్రసంగాలు నిర్వహించారని గుర్తు చేశారు. తాను ప్రముఖ పారిశ్రామిక వేత్తగా ప్రజలకు సేవలు చేస్తున్నానని, రాబోయే ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి తన అభ్యర్థిత్వానికి సంబంధించిన ప్రకటన కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. మహాచండీ ఆశీస్సుల కోసం హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, జస్టిస్ శ్రావణ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, ఎంఎల్‌సీ ఎస్.వాణీదేవి, అధికార ప్రతినిధి ఎన్వీ.సుభాష్, జెన్‌కో డైరెక్టర్ (వాణిజ్య, ఫైనాన్స్) డాక్టర్ టీఆర్‌కే.రావు, కే.దయాకర్‌రావు, రామకృష్ణారావు, పీవీ.సీతారామారావు, వొడితెల ప్రణవ్, పీవీ.మదన్, కిరణ్, డాక్టర్ సుధాకిరణ్, పీవీ.కశ్యప్, రిటైర్డ్ ఐజీ వంశీధర్‌రావు, నవీన్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



ఎల్కతుర్తి : ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విద్యార్థులు

ఎల్కతుర్తి : ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. మండలంలోని కేశవాపూర్ గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషన్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాల వల్ల లభించే పోషకాల విశిష్టతపై గర్భిణులకు, తల్లులకు, పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఇనుగాల వసంత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, పత్తిపాక గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, మంజుల మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని కోగిల్వాయి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పోషకాహారంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి మాట్లాడారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, గీతకుమారి, రమేష్, రఘునందన్, అంగన్‌వాడీ సిబ్బంది ఫాతిమా, జ్యోతిలక్ష్మీ, వినీత, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని కమలాపూర్, భీంపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడీ టీచర్లు పద్మకుమారి, వరలక్ష్మీ, సులోచన అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో వంటకాలు తయారు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, పోచయ్య, అంగన్‌వాడీ టీచర్లు పూర్ణిమ, రజిత, శ్రీలత, ఉమాదేవి, తిరుమల, ఆశ కార్యకర్తలు స్రవంతి, గంగ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండలంలోని దేవునూర్ గ్రామంలోని 1, 3వ అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ చిర్ర కవిత ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో, పోషన పక్వాడ, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శారద, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సుజాత, డాక్టర్ శ్వేతా, ఏఎన్‌ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

వేలేరు మండలంలో..

వేలేరు, పీచర జెడ్పీ హైస్కూళ్లలో, కేజీబీవీలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాగకుమారి, స్రవంతి, ఏఎస్సై భీంరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, కవిత, రాధ, సాంబలక్ష్మీ, పద్మ, జ్యోతి, లక్ష్మీ, రేణుక, జ్యోతి, వనిత పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ ప్రణీత చిరుధాన్యాలను చూపిస్తూ పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం చిరుధాన్యాలపై విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చుంచు కాల లింగారావు, ప్రతికంఠం ఉమాదేవి, బరిగల రాధిక, మమత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం



నడికూడ : పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని నార్లాపూర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరానిన ఎంపీపీ మచ్చ అనసూర్యతో కలసి పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి ప్రారంభించారు. కార్యక్రమంలో మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, మండల పశు వైద్యాధికారి బాలకృష్ణ, పాల్గొన్నారు.

పరామర్శ

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన జన్ను సరోజన అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్, సూర్య ట్రస్ట్ చైర్మన్ గజ్జి విష్ణు శుక్రవారం పరామర్శించారు. తొలుత సరోజన మృతదేహానికి విష్ణు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విష్ణు వెంట ప్రగతి యూత్ అధ్యక్షుడు జన్ను వినయ్, పొలెపాక ప్రశాంత్, పొలెపాక అనిల్, ఐత శ్రీధర్, గొర్రె పవన్, నల్ల ప్రణయ్, గన్నారం సిద్ధు తదితరులున్నారు.

'ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం'



మాట్లాడుతున్న భిక్షపతి, పక్కన విజయచందర్‌రెడ్డి

ఆత్మకూరు : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల హస్తం ఉందని బీజేపీ నేత, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఉద్యోగ నియామకాల భర్తీలో తీవ్ర జాప్యం చేయడమే కాకుండా నోటిఫికేషన్లు ఇచ్చిన పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు లీక్ కావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. నేడు (శనివారం) హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన బీజేపీ నిరుద్యోగ మహాధర్నాకు యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, కన్నెబోయిన రాజయ్యయాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, గురిజాల శ్రీరాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పీ.జయంత్‌లాల్, కొండి జితేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, వంగాల బుచ్చిరెడ్డి, బయ్య పైడి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎల్కతుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని ఎంఈఓ ఈసరి రవీందర్ తెలిపారు. మండలంలోని దామెర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బొల్లం సాల్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవాన్ని ఎంఈఓ రవీందర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, వారానికి మూడు కోడిగుడ్లతో కూడిన మధ్యాహ్న భోజనం, తదితర సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆదామ్, ఉపాధ్యాయుడు రామాంజనేయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ సాతూరి కిష్టయ్య, రవికుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితోనే సాధికారత



కమలాపూర్ : ఆర్థికాభివృద్ధితోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని తహసీల్దార్ పోలెపాక రాణి తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో లింగ ఆధారిత హింసపై శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో తహసీల్దార్ రాణి పాల్గొని మాట్లాడారు. సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు, కంప్యూటర్ శిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ సరిత, సర్వోదయ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, ఫీల్డ్ ఆఫీసర్లు అక్తర్, తిరుమల, శిక్షకులు హజారా, రోహినా పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్

వరంగల్ క్రైం: ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు సీపీకి పూలమొక్క అందజేశారు.

ఎమ్మెల్యే గండ్ర దంపతులకు సన్మానం

శాయంపేట : తమకు పే స్కేల్ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, సెర్ప్ ఉద్యోగులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి దంపతులను శుక్రవారం సన్మానించారు. తొలుత పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. కృతజ్ఞతలు తెలిపారు. సీసీలు విజయ్, అనూష, అనురాధ, హేమలత, కేదారి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కమలాపూర్ : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ బొలుమల్ల సంజీవ్ కోరారు. స్థానిక ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులకు సైబర్ నేరాలు, జాగ్రత్తలు, ట్రాఫిక్ రూల్స్, బాల్యవివాహాలు తదితర అంశాలపై ఆయన శుక్రవారం అవగాహన కల్పించారు. అపరిచితులకు ఓటీపీ నంబర్లు చెప్పవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జెడ్పీటీసీ లాండిగె కల్యాణి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పెండ్యాల రవీందర్ రెడ్డి, సంపత్‌రావు, సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్‌లో లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. యాజ్ఞికులు బీట్కూరి విజయసారథి ఆచార్యులు, అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి వేదమంత్రోచ్చారణల నడుమ ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీరం శ్రీలత రామకృష్ణారెడ్డి, ధ్వజస్తంభ దాత, ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్‌రెడ్డి, వికాస తరంగిణి అధ్యక్షుడు జనగాం సాంబయ్య, విగ్రహాల దాత చింతకింది రాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, న్యాయవాది టింగిలికార్ సత్యనారాయణ మనవరాలు వైభవదిత్య జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్టేషనరీ, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేవూరి దేవేందర్‌రెడ్డి, నాగబండి శివప్రసాద్, బాదం వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, కళ్యాణి, పార్వతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



ఆత్మకూరు : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న జగదీశ్వర్, తదితరులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ లోని, తిరుమలగిరిలోని కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థులకు హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల కుమారి, కేజీబీవీ ఎస్‌ఓ వాసవి, ఉపాధ్యాయులు సురేందర్, శేషగిరిరావు, వెంకట్రాంరెడ్డి, పద్మ, వేమారెడ్డి, తాళ్ల రవి, సముద్రాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి లోని జెడ్పీ హైస్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.5 వేలు విలువైన పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు మాట్లాడారు. లయన్స్ క్లబ్ సహకారం మరువలేనిదని చెప్పారు. పాఠశాల స్థితిగతులను క్లబ్ జోన్ చైర్మన్ జన్నపురెడ్డి రాజిరెడ్డి, వర్ధన్నపేట క్లబ్ అధ్యక్షుడు బిల్లా సుధీర్ రెడ్డి, కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షుడు అనిల్‌లకు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యాప్రమాణాలు పెంచడంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్, డైరీలు అందిస్తామని సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప రత్నకుమార్, ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దామెర : సీపీఎం ప్రజాపోరు యాత్ర వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ స్థలాల్లో పేదలకు, పోడురైతులు పట్టాలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబి సాంబయ్య, దుబాసి రాజేష్, దండు భాస్కర్, నాగవెల్లి ఐలయ్య, దేవేందర్, వేల్పుల అఖిల, సురావు రాధిక తదితరులు పాల్గొన్నారు.